మరో క్షణంలో.........

శేఖర్‌బాబు కూర్చుని ఉన్న సోఫాకు ఎదురుగా గోడకు వున్న కర్టెన్ ఆటోమాటిక్‌గా పక్కకు వెళ్ళిపోయింది. అటు చూశాడు శేఖర్‌బాబు ఆ శబ్దానికి.

ఆశ్చర్యం!

అలాగే కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు.

అది గోడకాదు. మందమైన గ్లాసులా వుంది, ట్రాన్స్‌పరెంట్‌గా. ఆవల గదిలో ఎవరో ఒక అందమైన అమ్మాయి ఇంతకు మునుపు మాగజైన్‌లో చూసిన బొమ్మలా ఒంటరిగా స్నానం చేస్తూంది. ఒంటిమీద బట్టల్లేవు. నీలిరంగు విద్యుద్దీప కాంతిలో ఆమె ఒళ్ళు మెరిసిపోతోంది. మధ్య మధ్య ఆమె విశాల నేత్రాలు సూర్యకిరణాలు పాకి మెరుస్తున్నట్టు తళుక్ తళుక్ మంటున్నాయ్.

పాలాభిషేకం జరుగుతున్న చలువరాతి నగ్న శిల్పం ప్రాణం పోసుకుంటున్నట్లు—

ఎదిగిన తీగ, పూసిన పువ్వులు రెక్కలొచ్చి ఎగిరిపోతున్నట్లు—

ఆకాశాన పాలపుంతల్లో నక్షత్రాలు ప్రణయ నృత్యాలు చేస్తున్నట్లు—

ఏ లోకంలో ఇది?

ఆమె ఎవరు?

గిరిలక్ష్మి?

గిరిలక్ష్మి"

అవును.......

నవ్వుతూవుంది, కవ్విస్తూవుంది.... తెల్ల, సున్నని ఆమె శరీరంపై జాల్వారుతున్న నీరు.... పన్నీరు.... ఆమె అందాల్ని అర్చిస్తున్నట్లు, ఆరాధిస్తున్నట్టు, ప్రదక్షిణలు చేస్తున్నట్టు, ఓహ్....

ఆ రాత్రి....

మధుసూదనరావుకు తన ఇంట్లో ఏ లోటూ కలగకుండా అన్ని ఏర్పాట్లు స్వయంగా చేసింది గిరిలక్ష్మి.

కుమారుడు కూర్చుని మేగజైన్‌లో "స్నాన సుందరి" బొమ్మను చూసిన గదిలోనే— తండ్రికి విడిది ఏర్పరిచింది.

స్వర్గ దృశ్యాలు చూపించింది. తండ్రి హృదయం కూడా రస స్పందన చెందే సమయాన "మధూ! నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అని చెప్పాయి మృదు మధురంగా గిరిలక్ష్మి పెదవులు మధుసూదనరావు గుండెల్లో.

ఆ రాత్రిని తడిపిన వర్షం తెల్లవారుజామున వెలిసింది.

❋ ❋ ❋

మెరీనా బీచ్‌లో సూర్య భగవానుడు మార్నింగ్ వాక్ చేస్తున్నాడు. మధుసూదనరావు వళ్ళు విరుచుకొని, కళ్ళు తెరవగానే— అభ్యంగన స్నాన మాచరించి, ధవళ వస్త్రధారిణియై అప్పుడే వికసించిన మల్లె పువ్వులా పరిమళం వెదజల్లుకూవచ్చి. గిరిలక్ష్మి టీ అందించింది.

రాత్రి జ్ఞాపకాలు కళ్ళు తెరిచాయి మధుసూదనరావు రక్తనాళాల్లో. ఆ అందాల రాశిని అలాగే చూస్తూ, 'టీ సేవ' పూర్తి చేశాడు.

ఖాళీ కప్పును అందుకుని, ప్లాటినం పాళీ అతని చేతికందించి, నవ్వులు వెదజల్లి, పువ్వులా నడిచిపోయింది గిరిలక్ష్మి.

భార్యకు ఉత్తరం రాయసాగాడు మధుసూదనరావు.

